క్లుప్తంగా

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు


అంగరలో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. అంగర, పడమర ఖండ్రిక, నాగులచెరువు, మాచర, కపిలేశ్వరపురం, తదితర గ్రామాల్లోని పారిశుధ్య కార్మికులు వీధుల్లోని చెత్తను తొలగించారు. ఉన్నతాధికారులు ఆదేశాలు మేరక, వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లోని డ్రెయినేజీల్లో పూడికను తొలగించారు. నివాసిత ప్రాంతాల్లో నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్టు కార్యదర్శులు తెలిపారు.

రోడ్డుపై చెత్తకుప్పలు తొలగించాలి

కాజులూరు: పెనుమళ్లలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో సరైన డంపింగ్ యార్డ్ సదుపాయం లేకపోవడంతో స్థానికులు గృహావాసాల్లోని చెత్తా చెదారం గ్రామ ముఖద్వారంలోని రోడ్డు పక్కల పారవేస్తున్నారు. పశువులు, కుక్కలు, కోళ్ల సంచారంతో చెత్త రోడ్లపైకి చేరుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా రోడ్డుపై చేరిన చెత్త కుళ్లిపోయి దుర్వాసనలు వెదజల్లుతోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. చెత్త పేరుకుపోవడంతో రోడ్లు, పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారవుతోందన్నారు. దీంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్తకుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ కార్యాలయంలో పాము హల్‌చల్

మండపేట: ఏడిద పంచాయతీ కార్యాలయంలోకి పాము చొరబడి హల్ చల్ చేసింది. బుధవారం కార్యాలయంలోని కంప్యూటర్ గదిలో ఆపరేటర్ మూర్తి తన పని చేసుకుంటుండగా ఓ పాము ప్రవేశించి భయాందోళనకు గురిచేసింది. రికార్డుల పక్క నుంచి జర్రిగొడ్డు పాము వచ్చి మూర్తి చేతిని కరిచినట్టు తెలిసింది. దీంతో కేకలు వేసుకుంటూ మూర్తి బయటకు పరుగుతీశారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి వుండమట్ల వీర్రాజు బాధితున్ని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి బైక్ పై తరలించారు. వైద్యులు రక్తపరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. కంప్యూటర్ గదిలోని జర్రిగొడ్డును గుర్తించిన సిబ్బంది దాన్ని చంపివేశారు. వైద్యులకు ఈవిషయం తెలియజేయడంతో వైద్య చికిత్స చేసి ఇంటికి పంపేశారు. మూర్తికి ప్రాణహాని తప్పిందని కార్యదర్శితోపాటు పంచాయతీ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. పంచాయతీ చెంతనే చెరువు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు పాములు బయటకు వచ్చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

చేనేత దుస్తులను ప్రతి ఒక్కరూ ధరించాలి

మండపేట: బీజేపీ ఆధ్వర్యంలో మండపేటలో చేనేత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. 2015లో ప్రధాని మోదీ ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించిన సందర్భంగా బీజేపీ నాయకులు ఈ వేడుకను నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరామ్, జిల్లా కార్యదర్శి గొడవర్తి రామచంద్రరావు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మహాత్మా గాంధీ ఖాదీ బండార్‌లో చేనేత వస్త్రాలు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత దుస్తులను ప్రతి ఒక్కరూ ధరించి మన సంప్రదాయానికి పెద్దపీట వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ టౌన్ అధ్యక్షుడు మద్దుల సుబ్బారావు, దుర్గారావు, వెత్సా ప్రసాద్, పాలిక రమణ పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి


కాజులూరు సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాజులూరు: దేశ సౌభాగ్యం కోసం పోరాటం చేసి ప్రాణాలు సైతం అర్పించిన స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను నిరంతరం స్మరించుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దూడల శంకరనారాయణ అన్నారు. బుధవారం కాజులూరులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకూ పార్టీలకు అతీతంగా ఘర్, ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడు రొక్కాల సత్తిబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు తలాటం అమ్మాజీ, మండల కమిటీ ఉపాధ్యక్షుడు వర్రే సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి పుణ్యమంతుల శివాజీ, యువమోర్చ అధ్యక్షుడు నిమ్మన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను పీడిస్తున్న జ్వరాలు


ద్రాక్షారామ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర బాధితుడు

- రోజురోజుకూ పెరుగుతున్న బాధితుల సంఖ్య
- దగ్గు, జలుబు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో సతమతం

రామచంద్రపురం రూరల్: గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వాతావరణంలో వచ్చే మార్పులతో పాటు వ్యాధులు కూడా కాలానుగుణంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఒక సీజన్ నుంచి మరొక సీజన్‌కు వాతావరణం మార్పులతో వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, తలనొప్పులు, టైఫాయిడ్, మలేరియా, డయేరియా, డెంగీ, చికున్‌గున్యా, శ్వాసకోశ వ్యాధులు వంటివి విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు జ్వరాలతో బాధపడుతున్న రోగులతో కిటకిటలాడుతున్నాయి. వైరల్ ఫీవర్లు అధికంగా ప్రజల్ని పట్టి పీడిస్తున్నాయి. వాతావరణంలో పెనుమార్పులే దీనికి కారణమని అంటున్నారు. ఉక్కబెట్టే వాతావరణం, చల్లగా మారిపోతున్న తేమ వాతావరణంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారు.

ఇంటింటా సర్వే..

సీజనల్ వ్యాధుల్ని అరికట్టేందుకు జ్వర బాధితుల్ని సకాలంలో రక్షించేందుకు ఇంటింట సర్వే చేస్తున్నారు. ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ఇంటింటా సర్వే చేస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, ఇతర ఇబ్బందులు ఉంటే తెలుసుకుంటున్నారు. రామచంద్రపురం, మండపేట యూహెచ్‌సీల్లో ఆరుగురు వైరల్ జ్వరాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో అనేక మంది జ్వరాలతో చికిత్స పొందుతున్నారు.

ఇన్‌ఫ్లుయెంజా ఫీవర్

ఇన్‌ఫ్లూయెంజా ఫీవర్ కేసులు ప్రస్తుతం పెరుగుతున్నాయి. శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు రోగులు వస్తున్నారు. దగ్గు, జలుబు, ఊపిరి ఆడకపోవడం, ఆయాసం వంటి లక్షణాలతో ఇన్‌ఫ్లుయెంజా ఫీవర్ వ్యాధిగ్రస్తులు ఇబ్బంది పడుతున్నారు. కోవిడ్ లక్షణాలను పోలి ఉండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. జాగ్రత్తలు తీసుకోకపోతే ఇది అంటువ్యాధిగా ప్రబలే అవకాశం ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పారిశుద్ధ్యం మరుగు పరుచుకోవాలి. డ్రైనేజీలను శుభ్ర పర్చుకోవాలి. నీటి గుంతల్ని, నీటి నిల్వలను ఉంచకూడదు. దోమల నిర్మూలన చేపట్టాలి. మంచినీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. వర్షపు నీటి నిల్వలున్న ప్రాంతాల్లో టైగర్ దోమ నిల్వతో డెంగీ వచ్చే ప్రమాదం ఉంది. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి. మాస్కు ధరించాలి.

జన సాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలి. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధి వచ్చిన వారికి దూరంగా ఉండాలి. తుమ్ములు, దగ్గులు, వచ్చినప్పుడు ఇతరులపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి.

ఆగస్టు మొదటి వారంలో జ్వర బాధితుల వివరాలు

మండలం	బాధితుల సంఖ్య
రామచంద్రపురం మండలం	
రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి	46
ద్రాక్షారామ పీహెచ్‌సీ	46
వెల్ల పీహెచ్‌సీ	36
రామచంద్రపురం యూహెచ్‌సీ–1	22
రామచంద్రపురం యూహెచ్‌సీ–2	21
కె.గంగవరం మండలం	
పామర్రు పీహెచ్‌సీ	21
కుందూరు పీహెచ్‌సీ	24
కాజులూరు మండలం	
గొల్లపాలెం పీహెచ్‌సీ	56
దుగ్గుదూరు పీహెచ్‌సీ	23
కపిలేశ్వరపురం మండలం	
అంగర పీహెచ్‌సీ	21
వాకతిప్ప పీహెచ్‌సీ	16
అచ్యుతాపురం పీహెచ్‌సీ	24
మండపేట మండలం	
మండపేట ప్రభుత్వ ఆసుపత్రి	54
మండపేట యూహెచ్‌సీ–1	21
మండపేట యూహెచ్‌సీ–2	12
ద్వారపూడి పీహెచ్‌సీ	22
కేశవరం పీహెచ్‌సీ	21
రాయవరం మండలం	
రాయవరం పీహెచ్‌సీ	26
మాచవరం పీహెచ్‌సీ	24

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రస్తుతం వైరల్ ఫీవర్ల సీజన్ కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. దోమకాటుకు గురి కాకుండా దోమ తెరలు కట్టుకోవాలి. దుస్తులు ఒళ్లంతా కప్పేలా ధరించాలి. పగలంతా ఇంటిలోకి గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలి. నీళ్లు నిలిచే ప్రదేశాల్లో దోమలు పెరగకుండా పెట్రోలు వంటివి వేయాలి. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి.

– డాక్టర్ ప్రవీణ్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, రామచంద్రపురం

అశ్రద్ధ చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి



జ్వరాల బారిన పడితే అశ్రద్ధ చేయకుండా సమీపంలోని వైద్యుల్ని సంప్రదించాలి. సీజనల్ వైరల్ జ్వరాలతో పాటు ప్రమాదకరమైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటివి అయితే రక్త పరీక్షలతో తెలుసుకుని తగిన వైద్యం పొందడం ద్వారా ప్రాణాపాయం తప్పించుకోవచ్చు. సాధారణ జ్వరాలే అనుకుని మెడికల్ షాపుల్లో మందులు కొనుక్కుని సొంత వైద్యాలు చేసుకోవద్దు.

– డాక్టర్ ఎస్. ప్రశాంతి, డివిజనల్ మెడికల్ ఆఫీసర్, రామచంద్రపురం

చేనేతకు పూర్వవైభవం తీసుకురావాలి


చేనేత కార్మికురాలిని సత్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు


పడాల అప్పారావును చేనేత మిత్ర బిరుదుతో సత్కరిస్తున్న చేనేత నాయకులు

మండపేట: చేనేత జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో మండపేటలో బీసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీసీ పట్టణ అధ్యక్షుడు మల్లువలస గణపతి అధ్యక్షతన బుధవారం స్థానిక బురుగుంట చెరువు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో చేనేత కార్మికులతో పాటు, బీసీ సంఘం క్రమశిక్షణ చైర్మన్ కోన సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా చేనేత మహిళ ఆసపు ఝాన్సీని సంఘ సభ్యులంతా దుశ్శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ ప్రభుత్వం చేనేతకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో చేనేత పనిపై ఆధారపడి వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని వారందరికీ ప్రభుత్వం ఆర్థిక పరంగా వెన్నుదన్నుగా నిలవాలన్నారు. చేనేత రంగానికి గత వైభవాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. చేనేతను ప్రోత్సహించేందుకు ప్రధాని నరేంద్రమోదీ 7 ఆగస్టు 2015 న జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేతకు ఇచ్చిన ప్రోత్సాహంతో ఉత్పత్తులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకుడు కాశిన వెంకటేశ్వరరావు, 6వ వార్డు కౌన్సిలర్ కాశిన కాశీ విశ్వనాథం, బీసీ సంఘం నాయకులు వీరమల్లు శ్రీనువాస్, పెంకే గంగాధర్, గోరు అన్నవరం, వినకోట రాధాకృష్ణ, పిఠాపురం సత్యనారాయణ, తీగిరెడ్డి మహేష్ గౌడ్, ఒంపోలు పోలరాజు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ఘన సత్కారం

రామచంద్రపురం రూరల్: హసన్‌బాద చేనేత సహకార సంఘంలో బుధవారం చేనేత దినోత్సవాన్ని సంఘ మాజీ చైర్మన్ దొంతంశెట్టి సత్యప్రకాశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల కోసం, చేనేత రంగం కోసం జీవితాంతం కృషి చేసిన దివంగత దొంతంశెట్టి విరూపాక్షం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయనతో పాటు చేనేత రంగం కోసం పాటు పడిన తాటిపర్తి చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పడాల అప్పారావును దుశ్శాలువాలు, పూలదండలతో సన్మానించి, చేనేత మిత్ర బిరుదుతో సత్కరించారు. చేనేత కార్మికుల సమస్యలపై కృషి చేసిన 5 గురిని కుటుంబ సమేతంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, చేనేత సంఘాల నాయకులు దొడ్డిపట్ల గణేశ్వరరావు, శలా పరమేశ్వరరావు, వాసా వీర్రాజు, ఉప్పు అర్ధనారీశ్వర బులిరాజు పాల్గొన్నారు.

సయ్యద్ రబ్బానీని పరామర్శించిన ఎమ్మెల్సీ తోట


రబ్బానీని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ఇటీవల గుండెపోటుకు గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ రబ్బానీని ఎమ్మెల్సీ, మండపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ తోట త్రిమూర్తులు పరామర్శించారు. బుధవారం పట్టణంలోని కృష్ణ కల్యాణి నగర్ రోడ్డులోని ఆయన నివాసానికి వెళ్లి రబ్బానీని పరామర్శించి ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 29వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, పార్టీ నాయకులు శిరంగు శ్రీనివాస్, సలాది వీరబాబు, ముక్కా సుబ్రహ్మణ్యం, షేక్ అన్వార్ అలీ, చల్లా దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

డాక్టరేట్ కోలా శ్రీమన్నారాయణకు ఘన సన్మానం


శ్రీమన్నారాయణ దంపతులను సత్కరిస్తున్న చిన్ననాటి స్నేహితులు

మండపేట: గీతం విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన కోలా శ్రీమన్నారాయణను తన చిన్ననాటి స్నేహితులు బృందం ఘనంగా సత్కరించింది. 1980–85లో మండలంలోని ఏడిద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని అధ్యాపకుడిగా నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పనిచేస్తున్న శ్రీమన్నారాయణకు డాక్టరేట్ బిరుదు వరించడంతో తన స్నేహితులు మండపేటలోని అయ్యప్ప దీక్షా మందిరంలో బుధవారం సన్మాన సభ మేకా నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈయన మెటీరియల్ సైన్స్‌లో బేరియం, కాల్షియం, జిర్కోనియం వంటి పలు మూలకాలపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించిందని నాగరాజు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి రావడం 1985 బ్యాచ్ విద్యార్థులకు గర్వకారణంగా ఉందని రెమ్మలపూడి జానకిరామ్ తెలిపారు. కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితులు మేకరామకృష్ణ, బండారు శ్రీరామచంద్రమూర్తి, రాగాల వెంకటరమణ, నెక్కంటి శ్రీనివాసరావు, అందే సత్యనారాయణ, మల్లిపూడి లక్ష్మి లావణ్య, బూరుగు వెంకట పద్మావతి దేవి పాల్గొన్నారు.

రామచంద్రపురం సీఐగా అశోక్


అశోక్, రామచంద్రపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్


సురేష్ బాబు మండపేట రూరల్ ఎస్సై


ఎం. లక్ష్మణ్ ద్రాక్షారామ ఎస్సై

రామచంద్రపురం: రామచంద్రపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కడియాల అశోక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కృష్ణా జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలో సీఐగా పని చేస్తూ రామచంద్రపురం బదిలీపై వచ్చారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను సీఐగా బాధ్యతలు స్వీకరించిన అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

రూరల్ ఎస్సైగా సురేష్ బాబు

మండపేట: మండపేట రూరల్ ఎస్సైగా డి.సురేష్ బాబు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్సైగా పనిచేసిన చైతన్యకుమార్ ఇటీవల నగరం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో సురేష్‌బాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సురేష్ ముమ్మిడివరం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఈయన చింతూరు, రామచంద్రపురం స్టేషన్లలోవిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను రూరల్ పోలీస్ సిబ్బంది సాదరంగా ఆహ్వానం పలికారు.

ద్రాక్షారామ ఎస్సైగా ఎం.లక్ష్మణ్ బాధ్యతల స్వీకరణ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ ఎస్సైగా ఎం.లక్ష్మణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా ఉండి పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై జి.సురేంద్ర కొత్తపేట బదిలీపై వెళ్లారు. ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇస్తానని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. సిబ్బంది పుష్ప గుచ్చాలతో ఆయనకు స్వాగతం పలికారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం ఈఈ విజయానంద్ బుధవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అంగర, టేకి, మాచరమట్టలు, శ్రీరామపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 8 నుంచి 12 గంటలు వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

రామచంద్రపురం: టౌన్ సబ్‌స్టేషన్‌లో 11కేవీ ఓదురు ఫీడర్, 11కేవీ టౌన్ ఫీడర్, చెల్లూరు ఫీడర్లు అత్యవసర మరమ్మతుల నిమిత్త నేటి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.విజయానంద్ బుధవారం పేర్కొన్నారు. పట్టణ పరిధిలో వీఎస్ఎం కాలేజ్, లెప్రసీ కాలనీ చింతపల్లి సూరన్న నగర్, పసలపూడి లేఅవుట్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, కాకినాడ రోడ్డు, డాడీగారి రైస్ మిల్లు, కాకినాడ రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా ఉన్నప్రాంతం, గుబ్బల వారి పేట, అంకం వారి వీధి స్టీల్ వాల్ పేట, మార్కెట్ సెంటర్, శివాలయం వీధి ప్రాంతాల్లోనూ, మండల పరిధిలోని చోడవరం నరసరావుపేట, ఓదూరులో గల ఆక్వా సర్వీసెస్, నూకల మిల్లు, అమృత రైస్ మిల్లు, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గొల్లపాలెం సబ్ స్టేషన్‌లో మరమ్మతులు

కాజులూరు: గొల్లపాలెం 333/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ ఎస్ ఉదయభాస్కర్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. గొల్లపాలెం 11 కేవీ ఇండ్రస్టియల్ ఫీడర్ పరిధిలోని కాజులూరు మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, మొగలిపాలెం, 11 కేవీ ఎమ్‌హెచ్‌క్యూ 1 పరిధిలోని బందనపూడి, చీకట్లవారిపేట, ఊడావారిపేట, కరప మండలం కొంగోడు, కాజులూరు 11 కేవీ ఇండ్రస్టియల్ ఫీడర్ పరిధిలోని అయితపూడి, తిప్పరాజుపాలెం, శీల, మేకలగరువు, పల్లిపాలెంలో విద్యుత్‌లైన్లలోని ఇండ్రస్టియల్, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

రాయవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

రాయవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు రామచంద్రపురం ఏపీఈపీడీసీఎల్ ఈఈ వై.విజయానంద్ బుధవారం తెలిపారు. రామచంద్రపురం 33/11 కేవీఏ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి రాయవరం, మండపేట మండలం ఏడిద ఫీడర్లకు విద్యుత్ సరఫరా చేసే లైన్లలో మెయింటెనెన్స్ పనులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు. సోమేశ్వరం, మాచవరం, లొల్ల, పసలపూడి, నరాలవారిపాలెం, చెల్లూరు, యర్రమట్టిపురం, రామచంద్రపురం, కొత్తూరుకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

సీట్లు పెంచి ఈడబ్ల్యూఎస్ అమలు చేయాలి

రాజోలు: మెడికల్ కళాశాలల్లో సీట్లు పెంచి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయాలని రాజోలు నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు ఆకుమర్తి భూషణం కోరారు. బుధవారం ఆయన రాజోలులో మాట్లాడుతూ మెడికల్ సీట్లు పెంచకుండా ఈడబ్ల్యూఎస్ అమలు చేస్తు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నష్టం కలుగుతుందన్నారు. అలాగే సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లుకు అనుకూలంగా ఉన్న జీఓ 107, 108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

పి.గన్నవరం: వశిష్ట నదిలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంలో ఊడిమూడికి చెందిన యువకుడు చదలవాడ విజయకృష్ణ మృతి చెందగా అతడి కుటుంబానికి బుధవారం నామన ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు రూ.5 వేలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్న కుమార్, ఎంపీటీసీ ఆదిమూలం సూరయ్యకాపు, నాయకులు వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ ఢీకొని చూడి ఆవు మృతి

అంబాజీపేట: స్థానిక పశువుల ఆస్పత్రి సమీపాన బుధవారం ఆర్టీసీ బస్ మూడు నెలల చూడి ఆవును ఢీ కొట్టడంతో అక్కక్కడిక్కడే మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సత్యసాయినగర్‌లో పెదమల్లు గుప్తాకు చెందిన మూడు నెలల చూడి ఆవును వీధి కుక్కలు వెంటపడి కరిచేందుకు ప్రయత్నించాయి. ఈ సమయంలో వాటి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ప్రధాన రహదారి రోడ్డు దాటుతుండగా రావులపాలెం నుంచి అమలాపురం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్ బలంగా ఢీ కొట్టడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది.

జగన్‌ను కలిసిన బిక్కిన కుటుంబం


మాజీ సీఎం జగన్‌కు ఆహ్వాన పత్రికను అందిస్తున్న బిక్కిన కుటుంబ సభ్యులు

మండపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి కుటుంబం బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 11న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చోడే శ్రీకృష్ణ, స్వరూపల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని జగన్‌కు ఆహ్వాన పత్రికను డాక్టర్ బిక్కిన అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణకు జగన్ అభినందనలు తెలిపి ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజబాబు, వైఎస్సార్‌సీపీ డాక్టర్ సెల్ జిల్లా కన్వీనర్ చోడే సత్యకృష్ణ పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

మండపేట: టిడ్కో కాలనీలో గత రాత్రి విద్యుత్ సరఫరా లేక ఇబ్బందిపడుతున్న విషయంపై కథనాన్ని సాక్షిలో ప్రచురించగా దీనిపై స్పందించిన ఈఈ వై విజయానంద్, డీఈఈ చొల్లంగి శ్రీధర్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. విద్యుత్ అంతరాయం ఉందని ఫిర్యాదు అందడంతో ఈఈ, డీఈఈ తమ సిబ్బందితో కలిసి కాలనీలోని 10 నంబరు బ్లాకు వద్దకు వెళ్లి పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కంట్రోల్ ప్యానల్‌కు వెళ్లే కేబుల్ వైర్లు కాలిపోయినందున సరఫరా నిలిచిపోయిందన్నారు. ఇది చేయాల్సిన బాధ్యత టిడ్కో అధికారులదని, ఆ సమస్యను వారికి వివరించామన్నారు. తక్షణమే అండర్ గ్రౌండ్ కేబుల్స్ మార్చాలని టిడ్కో అధికారులకు సూచించామని చెప్పారు. ఈ విషయంలో తమ సిబ్బంది ఎవరి వద్ద డబ్బులు ఇవ్వాలని అడగలేదని వారన్నారు. తమ సిబ్బంది టిడ్కో అధికారులకు తోడుగా ఉండి రాత్రే సమస్యను పరిష్కరించి విద్యుత్‌ను పునరుద్ధరించారని తెలిపారు.

చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు


కపిలేశ్వరపురంలో చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు బుధవారం పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.రత్నకుమారి ఆదేశాలపై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యంపై పరిశీలన చేశారు. చిన్నారుల్లో ఎత్తుకు తగ్గ బరువు, పౌష్టికాహార లభ్య తదితర అంశాలను పరిశీలించారు. గర్భిణులు, చిన్నారులకు టీకాలు వేయడం ద్వారా వ్యాధి నిరోధక శక్త పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి దివ్యశ్రీ, సచివాలయ ఏఎన్ఎం శిరోమణి, వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హిరోషిమా డే

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం వివేకానంద ఉన్నత పాఠశాలలో హిరోషిమా డే నిర్వహించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) మలికిపురం మండలం అధ్యక్షుడు పీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు పర్యావరణానికి, దేశ మానవాళికి ముప్పుగా ఉన్న అణ్వాయుధాలు అవసరం లేదని , సైన్స్ అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని, వినాశనానికి కాదని ఈరోజు హిరోషిమా, నాగసాకి ఉదంతాలు తెలియజేస్తున్నాయన్నారు. మూడో ప్రపంచ యుద్ధం జరిగితే మొత్తం జీవరాశులంతా నాశనం అవుతుందని హెచ్చరించారు. విద్యార్థులు గుడిమెళ్లంక వంతెన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. 'యుద్ధాలు వద్దు– ప్రపంచ శాంతి ముద్దు' 'అణ్వస్త్రాలు వద్దు–అన్నవస్త్రాలు ముద్దు' అంటూ పలు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.పద్మజ, బి.ఫణి లక్ష్మి, కె.సునీత విద్యార్థులు పాల్గొన్నారు.